
పెంట్లవెల్లి : మంచాలకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది


నాగర్‌కర్నూల్ : చర్లతిర్మలాపూర్ రోడ్డుపై వరదనీరు నిల్వ ఉండడంతో నిలిచిన రాకపోకలు


కృష్ణానదిలో చీమలతిప్పపై నివాసం ఉంటున్న చెంచు, వైజాగ్ జాలర్లు


దేవరకద్ర రూరల్ : ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న కౌకుంట్ల వాగు

# వాన.. హైరానా

- ఉమ్మడి పాలమూరులో వర్షం విలయం
- ప్రమాదకరంగా పారుతున్న వాగులు
- మత్తడి దుంకుతున్న చెరువులు, కుంటలు
- తెగిన కాల్వలు, నీటిపాలైన పంటలు
- సీసీకుంట సబ్‌స్టేషన్‌ను చుట్టుముట్టిన నీళ్లు
- ఇంకా అంధకారంలోనే పలు గ్రామాలు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటనష్టం సంభవించింది. భారీ వర్షాలకు అటు వాగులు వంకలు ఉప్పొంగడం, ఇటు ప్రాజెక్టుల గేట్లు తెరుచుకోవడంతో ఒక్కసారిగా వరద నీరు పొలాలను ముంచెత్తింది. మరోవైపు చెరువులు అలుగులు పారి వందలాది ఎకరాల పంట నీటిపాలైంది. సుమారు లక్ష ఎకరాల వరకు పంట నష్టం సంభవించినట్లు అనధికార వర్గాల అంచనా. అయితే వ్యవసాయ అధికారులు మాత్రం పంట నష్టం వివరాలు సేకరిస్తున్నామని ఇప్పుడే అంచనా వేయలేకపోతున్నామని చెబుతున్నారు. ఇంకా చాలా జిల్లాల్లో గ్రామాలకు వెళ్లే రహదారులు తెగిపోవడం, వంతెనలు, కాజ్‌వేల్లో వరద నీరు పారుతుండడంతో అధికారులు పంటనష్టం అంచనా వేయలేకపోతున్నారు. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడంలో ఉమ్మడి జిల్లా అధికార యంత్రం పూర్తిగా విఫలమైంది. అనేక చోట్ల ఇంకా జలదిగ్బంధంలోనే గ్రామాలు ఉన్నాయి. బయటి ప్రపంచంతో చాలా గ్రామాలకు కనెక్టివిటీ తెగిపోయింది. మహబూబ్‌నగర్-తాండూర్ రహదారి మరమ్మతు పనులు చాలా నిదానంగా సాగుతుండడంతో వందలాది వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రద్దీగా ఉండే ఈ రహదారిపై రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీవర్షంతో మహబూబ్‌నగర్ పట్టణం పూర్తిగా జలమయమైంది. చాలాచోట్ల అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టకపోవడంతో కాలనీవాసులు సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టుకొని వరద నీటిని తోడుకుంటున్నారు. మరికొన్ని చోట్ల వారే వరద నీరు వెళ్లేందుకు ప్రొక్లెయినర్లతో కాల్వలు తవ్వుకుంటున్నారు. అయితే ఉమ్మడి జిల్లా అంతా భారీ వర్షాలకు అతలాకుతలం అవుతున్నా.. జిల్లాకు చెందిన మంత్రి బాధితులను పట్టించుకోకపోవడం, కనీసం పరామర్శకు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉమ్మడి జిల్లా అధికారులతో వరద పరిస్థితిపై కనీసం సమీక్షలు కూడా జరపకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలకు ఇల్లు కూలి నిరాశ్రయులైన వారిని సురక్షిత ప్రదేశాల్లో ఉంచి వారికి వసతి ఏర్పాటు చేయకపోవడంతో బాధితులు గుళ్ల గోపురాల్లో తలదాచుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇండ్లు కూలి ముగ్గురు చనిపోయినా ప్రభుత్వ తరఫున వారికి నష్టపరిహారం కూడా అందించలేకపోయారు. ఇటు అధికార యంత్రాంగం అటు జిల్లా ఎమ్మెల్యేలు చుట్టపుచూపుగా వచ్చి పోతున్నారని బాధితులు వాపోతున్నారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు జనాలను పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. భారీ వర్షాల నేపథ్యంలో చాలా గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట సబ్‌స్టేషన్ నీట మునగడంతో చుట్టుపక్కల ఉన్న 20 గ్రామాలకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది.


వెంకటాపూర్ వద్ద గండ్లు పడిన ఎంజీకేఎల్ఐ 29వ ప్రధాన కాల్వ

## కాల్వలు.. కడగండ్లు

- ఎంజీకేఎల్ఐ ప్రధాన కాల్వకు గండ్లు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- శాశ్వత పనులు చేపట్టకపోవడమే కారణం

కల్వకుర్తి, సెప్టెంబర్ 2 : కల్వకుర్తి ప్రాంతానికి సాగు నీరందించే కేఎల్ఐ 29వ ప్యాకేజీకి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కేఎల్ఐ ప్రధాన కాల్వకు గండ్లు పడ్డాయి. వరద నీరు చెరువులోకి భారీగా చేరడంతో చెరువుకు కూడా గండ్లు పడ్డాయి. దీంతో చెరువు దిగువన ఉన్న రైతుల పంట పొలాలు నీటిలో మునిగి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కల్వకుర్తి ప్రాంతానికి త్వరితగతిన కృష్ణా సాగునీరు ఇవ్వాలనే సదుద్దేశంతో కొన్ని చోట్ల తాత్కాలిక పద్ధతిన పనులు చేశారు. ఆ తర్వాత ప్రాధాన్యతా క్రమంలో 29వ ప్యాకేజీ కాల్వలో శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నవంబర్ 2023 నాటికి కాల్వలో నీళ్లు బంద్ అయ్యాయి. ప్రభుత్వం కాల్వకు సంబంధించి మరమ్మతు పనులు చేపట్టలేదు. తీరా వానకాలం ప్రారంభంలో పనులు ప్రారంభించింది. ఇంతలోనే కృష్ణానదికి వరదలు రావడం, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా ప్రధాన కాల్వలకు సాగునీరు ఇవ్వడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో కాల్వలోకి ఏర్పాటు చేసిన ఇన్‌లెట్‌ల ద్వారా భారీగా వర్షం నీరు చేరింది. దీంతో తాత్కాలిక పద్ధతిన ఏర్పాటు చేసిన యూటీల వద్ద కేఎల్ఐ కాల్వకు భారీ గండ్లు పడ్డాయి. కల్వకుర్తి మండలం వెంకటాపూర్ గ్రామం(కేఎల్ఐ 29వ ప్యాకేజీ 128వ కిలో మీటర్ వద్ద) కేఎల్ఐ కాల్వకు యూటీ వద్ద గండి పడింది. కాల్వలోని నీరు గండి ద్వారా లింగారెడ్డికుంట, మాచినేనికుంట నుంచి అలుగులు పారాయి. దీంతో పొలాలు కోతకు గురయ్యాయి. వరిపంట, పత్తి చేలు నీటమునగడమే కాకుండా రైతులు పొలాలకు వెళ్లే బాటలు వరదనీటికి కొట్టుకుపోయాయి. కేవలం కాల్వ పనులు శాశ్వత ప్రాతిపదికన చేపట్టకపోవడం వల్లనే భారీ నష్టం సంభవించిందని రైతు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర నష్టాల్లో ఉన్న తమకు వరద మరింత నష్టం చేకూర్చిందని, ప్రభుత్వం మానవత్వంతో ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## క్షణక్షణం.. భయంభయంగా..


- కృష్ణానదిలో చిక్కుకున్న వైజాగ్ జాలర్లు
- నల్లమల చెంచుగూడేలకు కనెక్టివిటీ కట్

కొల్లాపూర్, సెప్టెంబర్ 2 : నల్లమలలోని కృష్ణానది పొంగిపారుతుండడంతో అక్కడి జాలర్లు, చెంచులు భయాందోళన చెందుతున్నారు. అమరగిరికి సమీపంలో నది మధ్యలో ఉన్న చీమలతిప్పపై ఆంధ్రాలోని వైజాక్‌కు చెందిన 45 జాలర్ల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే మూడ్రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నది ప్రవాహం రోజురోజుకూ పెరగడంతో ద్వీపంలాంటి గుట్టపై ఉన్న జాలర్లు ప్రమాదపుటంచున క్షణక్షణం.. భయం నీడలో బతుకుజీవుడా అన్నట్లు మిగిలారు. కొండ పైభాగానికి చేరుకొని తల దాచుకున్నారు. అలాగే చేపల వేటకు వెళ్లి కనటాగువాగు, గుండ్లపెంట వద్ద స్థావరాలను ఏర్పాటు చేసుకున్న చెంచులు సైతం నదీ ప్రవాహంలో చిక్కుకున్నారు. చేపలవేటకు వెళ్లిన చెంచులు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే సోమవారం వరద కొంచెం తగ్గుముఖం పట్టడంతో ఊపిరిపీల్చుకున్నారు. 2009 ఏడాదిలో వచ్చిన వరదలు మళ్లీ పునరావృతం అవుతాయా..? అని ఆందోళన చెందారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో జాలర్లను హెచ్చరించడంతోపాటు నదిలో ప్రమాదంలో ఉన్న జాలర్లను ఒడ్డుకు రప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతిసారీ ఇబ్బందులే..

చేపల వేట జీవనాధారంగా బతికే చెంచులు కృష్ణా నదిలోకి వెళ్లి వరదలో చిక్కుకుపోయారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు వాళ్లు ఎలా ఉన్నారో తెలియలేదు. ఆదివారం సంతకు వచ్చే వారు రాకపోవడంతో భయపడ్డాం.. వరద ఉధృతి తగ్గడంతో ప్రమాదమేమీలేదు. వరదలు వచ్చిన ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. *- మల్లేశ్, చెంచు సంఘం నాయకుడు, అమరగిరి*


మరికల్ : కన్మనూర్ బ్రిడ్జి వద్ద వరద ధాటికి తెగిపోయిన రోడ్డు


కోడేరు : రేకులపల్లి శివారులో వరద ప్రవాహానికి వరి పొలంలో ఇసుకమేటలు


ఇటిక్యాల : బీచుపల్లి పుష్కరఘాట్ చెంతన ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కృష్ణానది


నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలో నీటమునిగిన పత్తి పంట

## వర్ష బీభత్సం

- వనపర్తి జిల్లాలో కూలిన 80 ఇండ్లు
- 13 గ్రామాల మధ్య తెగిన రహదారులు
- 700 ఎకరాల్లో పంట నష్టం
- పడిపోయిన 105 కరెంట్ స్తంభాలు
- 35 చోట్ల చెరువులు, కాల్వలకు గండ్లు

వనపర్తి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : వర్షాలతో జిల్లాలో ఒక పక్క 700 చెరువులు అలుగులు పారుతుండగా మరోపక్క పాత ఇండ్లు కూలిపోవడం, పంట నీట మునగడం, చెరువులు, కాల్వలకు గండ్లు పడడంతో తీవ్ర నష్టం కలిగింది. కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేశారు. అధికారులను సైతం అలర్ట్ చేయడంతో ప్రమాదాలు, ప్రాణనష్టాలను కొంతమేర తగ్గించిందని చెప్పొచ్చు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 700 ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. వీటిలో అధికంగా వరి ఉండగా, మిగిలిన వాటిలో వేరుశనగ, కంది పైర్లుతం ఉన్నాయి. దాదాపు 80 వరకు పాత ఇండ్లు కూలిపోయాయి. తాటిపాములలో ఒక వ్యక్తి చనిపోయాడు. 14 చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. మరో 25 ప్రాంతాల్లో ఇప్పటికీ రోడ్లపైనే నీరు పారుతున్నది. ఎనిమిది చెరువులు తెగిపోగా, 28 చోట్ల భీమా, కేఎల్ఐ కాల్వలకు గండ్లు పడ్డాయి. 105 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా. అయితే, పంట నష్టం వివరాలు, రోడ్లు, కూలిన ఇండ్ల వివరాలు ఇంకా పెరిగే అవకాశం ఉన్నది. వర్ష బీభత్సంపై అధికారులు పూర్తి స్థాయిలో అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.


వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట చెరువులో గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి

## బోటెక్కి.. గుర్రంగడ్డ చేరి..

- నదిప్రవాహం దాటి గ్రామానికి చేరిన గద్వాల కలెక్టర్, ఎస్పీ

గద్వాల, సెప్టెంబర్ 2 : జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు బోటెక్కి సోమవారం కృష్ణానది మధ్యలో ఉన్న దివి గ్రామమైన గుర్రంగడ్డకు చేరుకున్నారు. అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కరెంట్ కోతలు లేకుండా సంబంధిత అధికారులతో మాట్లాడుతామని, అంగన్‌వాడీ టీచర్‌ను నియమిస్తామని, సబ్ సెంటర్‌లో వైద్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. అనంతరం తిరిగి బోటులో బీచుపల్లి వరకు వారు ప్రయాణం చేశారు. వారి వెంట తాసీల్దార్ కరుణాకర్, వైద్యాధికారి సిద్ధప్ప, డాక్టర్ ఏంజెల్ ఉన్నారు.


బోటులో గుర్రంగడ్డకు వెళ్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

### భారీగా పంట నష్టం

ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లింది. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో నష్టం తీవ్రత ఎక్కువగా ఉన్నది. ఈ రెండు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు వంకలు ఉప్పొంగి, చెరువులు కుంటలు అలుగుపారాయి. దీంతో వాగు పరివాహ ప్రాంతాలతోపాటు చెరువుల కింద ఉన్న వందలాది ఎకరాలు నీట మునిగాయి. దీనికి తోడు పెద్దవాగులన్నీ ఉప్పొంగడంతో ప్రాజెక్టుల గేట్లను తెరిచారు. ఈ నీరు కూడా చేరడంతో భారీగా పంట నష్టం సంభవించింది. వరద నీరు అంతా రహదారులపై ప్రవహిస్తుండడంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఫలితంగా వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాలకు చేరుకోలేకపోతున్నారు. పంటనష్టం అంచనాకు కూడా రాలేకపోతున్నారు. మరోవైపు కేఎల్ఐ, భీమా, నెట్టెంపాడుతోపాటు అనేక కాల్వలకు గండ్లు పడ్డాయి. వాటి నీరంతా పొలాల్లోకి మల్లుతోంది. వరద నీటితో పంట కొట్టుకుపోగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


నీటమునిగిన చిన్నచింతకుంట సబ్‌స్టేషన్

## సహాయక చర్యలు అంతంతే..!

- పరిశీలనలు తప్పా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఉమ్మడి జిల్లాలో పరామర్శకు రాని మంత్రి
- ఇండ్లు కూలి మృతి చెందిన కుటుంబాలకు రిక్తహస్తం

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు జనాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జిల్లా కేంద్రాల్లో మున్సిపాలిటీలు, మండల కేంద్రాలతోపాటు అనేక గ్రామాల్లో వరద నీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. రహదారులు తెగిపోయాయి.. ఇతర గ్రామాలకు వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితి. అయితే ప్రభుత్వ యంత్రాంగం మాత్రం సహాయక చర్యలు చేపట్టడంలో విఫలమైందని విమర్శలు వస్తున్నాయి. కలెక్టర్లు ఎస్పీలు కేవలం సమీక్షలతో సరిపెడుతున్నారు. బాధితులు వరదల్లో చిక్కుకొని నిరాశ్రయులు అవుతున్నా వారిని పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. రహదారుల మరమ్మతులు, వరద నీటిని మళ్లించడం వంటి చర్యలు కనిపించడం లేదు. ఇక జిల్లా కేంద్రాల్లో అనేక కాలనీలు జలమయమయ్యాయి. దీంతో మున్సిపల్ సిబ్బంది వచ్చి చేయాల్సింది పోయి ఆయా కాలనీవాసులే నీటిని మళ్లించుకుంటున్నారు. ఇండ్లల్లోకి మురుగునీరు చేరి రాత్రి జాగరణ చేసిన అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

***చీకట్లో మగ్గుతున్న గ్రామాలు..***

భారీ వర్షాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాలు ఇంకా చీకట్లోనే మగ్గుతున్నాయి. కొన్నిచోట్ల సబ్ స్టేషన్లలోకి వరద నీరు రావడం, భారీ వర్షాలకు కరెంటు స్తంభాలు విరిగిపోవడం, వైర్లు తెగిపోవడంతో చాలా గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మరమ్మతులు చేయడానికి కూడా వీలు కావడం లేదు. దీంతో విద్యుత్ అధికారులు గ్రామాలు, పట్టణాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేకపోవడంతో ప్రజలు ఇంకా చీకట్లోనే మగ్గుతున్నారు. అప్పంపల్లి సబ్‌స్టేషన్‌ను పునరుద్ధరించారు.

## రోడ్డుకు కొత్త జీవో తెచ్చే దమ్ముందా?

- వారంలోగా బాలానగర్-గంగాపూర్ రహదారికి అనుమతులు తెచ్చి చూపించు
- సెజ్ కంపెనీలు డబ్బులేసిన ఖాతాలు చూపెట్టాలి
- విమర్శలు మానుకొని ప్రగతిపై దృష్టి సారించు..
- కబ్జాలపై కమిటీ వేద్దాం.. నిజాలు తేలుద్దాం
- ఎమ్మెల్యే అనిరుధ్‌కు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సవాల్

జడ్చర్ల, సెప్టెంబర్ 2 : ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి.. ఉట్టి ప్రగల్భాలు మానుకొని బాలానగర్-గంగాపూర్ డబుల్‌లేన్ రోడ్డుకు కొత్త జీవోను తెచ్చే దమ్ముందా..? అని మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సవాల్ విసిరారు. ఈ రోడ్డు వేయడానికి తన హయాంలో 19 జూలై 2023లో జీవో రాగా.. టెండర్లు పూర్తయి పనులు ప్రారంభమయ్యాయని, అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయని తెలిపారు. కానీ అది మంజూరే కాలేదని కేవలం ఒక కాగితం మాత్రమే తీసుకొచ్చారని, ఎన్నికల తర్వాత తాను రోడ్డు వేయడానికి జీవోను తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే చెబుతున్నారని, రీ టెండర్‌ను వేయడం జరిగిందని, అతను తీసుకొచ్చిన జీవోను చూపించాలన్నారు. సోమవారం పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్స్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ పోలేపల్లి సెజ్‌లోని కంపెనీల నుంచి సీఎస్ఆర్ ఫౌండేషన్ ఖాతాలో డబ్బులు వేయించుకున్నారని ఎమ్మెల్యే ఆరోపణలు నిరాధారమన్నారు. ఫౌండేషన్‌కు గాని, తన సంబంధిత ఖాతాల్లో గానీ ఒక్క రూపాయి వేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు, పదవుల నుంచి తప్పుకొంటానని, లేకుంటే నీవు ముక్కు భూమికి రాసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సూచించారు. సెజ్ కంపెనీల నుంచి నెలకు రూ.70 లక్షలు వస్తున్నాయని చెబుతున్నారు కదా.. మీరు అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతుంది.. ఇప్పటివరకు రూ.6 కోట్లకుపైగా వచ్చిన వాటిని ఎక్కడ దాచారో చెప్పాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఒక్క రూపాయి అవినీతికి పాల్పడలేదని, ఎక్కడైనా జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. లేకుంటే తప్పు ఒప్పుకొని క్షమాపణ చెప్పాలన్నారు. మున్సిపాలిటీలో కబ్జాలంతా గత కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని, ఊరచెరువులో ఉన్న వెంచర్‌కూ వారి హయాంలోనే అనుమతినిచ్చారన్నారు. కబ్జాలపై కమిటీ వేసి నిజాలు తేలుద్దామన్నారు. స్థానిక వందపడకల దవాఖాన భవనం లోలెవల్‌లో నిర్మించారని తరచూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్టణం నడిబొడ్డున మూడెకరాల స్థలం ఇప్పిస్తే వచ్చే వర్షాకాలంలోగా సేమ్ బిల్డింగ్‌నే కట్టించి దవాఖానకు ఇస్తానన్నారు. దవాఖాన నిర్మాణ సమయంలో జడ్చర్ల-కల్వకుర్తి రోడ్డు కిందకు ఉండేదని.. రోడ్డు విస్తరణప్పుడు ఎత్తు పెంచారన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, కౌన్సిలర్లు దేవా, లత, చైతన్య, నందకిశోర్, మహేశ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మురళి, యాదయ్య, మురళి, రామ్మోహన్, నాగిరెడ్డి, శ్రీకాంత్, ఇంతియాజ్‌ఖాన్, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, శ్రీనివాస్‌యాదవ్, నర్సింహులు, బాలు, శ్రీను, హఫీజ్ ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి